క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


సచివాలయం వద్ద కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

రామాపురం : పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని కేంద్ర, రాష్ట్ర పర్యావరణ శాఖల ఆదేశాల మేరకు మండలంలోని నల్లగుట్టపల్లె సచివాలయం వద్ద సోమవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మన భూమి, మన జీవితం అనే కార్యక్రమంపై ప్రజలకు వివరించారు. ప్రధానంగా ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని వాయు కాలుష్యాన్ని నియంత్రించాలని, ధ్వని కాలుష్యం తగ్గించాలని, జల కాలుష్యాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటడంతో పాటు అడవుల పరిరక్షణలో అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ మునెమ్మ, కళాజాత బృందం, సభ్యులు రవి వెంకటేష్లు పాల్గొన్నారు.

నివాళి


వీరారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న గడికోట మోహన్‌రెడ్డి, నాయకులు

రామాపురం : మండలంలోని గంగనేరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గాలివీటి వీరారెడ్డి మృతి చెందినట్లు సోమవారం స్థానిక నాయకులతో సమాచారం అందిన వెంటనే మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, పెద్దిరెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, ఆదిరెడ్డి, నాగేషారెడ్డి, వెంకట్రాజు, శంకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు వీరారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వేడుకగా సీతారామ కల్యాణ మహోత్సవం


సీతారామ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న పూజారులు

నిమ్మనపల్లె : మండల కేంద్రమైన నిమ్మనపల్లెలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో, హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా, ఆదివారం రాత్రి శ్రీ భద్రాద్రి సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద బహిరంగ వేదికపై, వందల సంఖ్యలోని భక్తులు హాజరవగా వేద మంత్రోచ్ఛారణలతో పూజారులు కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం 9 కిలోల దేవుని లడ్డూ వేలం నిర్వహించారు. రూ.31 వేల ధరకు చిత్తూరుకు చెందిన శశికుమార్ స్వామివారి దక్కించుకున్నారు. ప్రత్యేకంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సోమవారం పగలు తిరనాల కోలాహలంగా జరిగింది. సాయంత్రం ఉట్ల మాను ఉత్సవం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఉట్ల మాను ఎక్కేందుకు యువకులు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. అడుసుపల్లెకు చెందిన మహేష్ విజేతగా నిలవగా, రూ.1,116 నగదు బహుమతిగా అందజేశారు.

వైభవంగా నల్లగంగమ్మ తిరునాల


ప్రత్యేకాలంకరణలో నల్లగంగమ్మ

కేవీపల్లె : మండలంలోని సొరకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లెలో నల్లగంగమ్మ తిరునాల అంగరంగ వైభవంగా జరిగింది. రెండు రోజులగా అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి సోమవారం ఉదయం వరకు చాందినీ బండ్లు ఆలయ ప్రదక్షిణ, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సోమవారం ఉదయం పరిసర గ్రామాల భక్తులు అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

నైపుణ్యం వెలికితీయడానికే పోటీపరీక్షలు

కలకడ : విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడానికి గ్రంథాలయంలో పోటీ పరీక్షలు నిర్వహించినట్లు గ్రంథాలయ శాఖాధికారి అమరనాథ తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో కథల పుస్తకాలు చదవడం, కథలు వినిపించడం, డ్రాయింగ్, చెస్, క్యారంబోర్డ్ ఆటల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను సోమవారం అందజేశారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి 11.30గంటల వరకు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు.

ఆలయాల్లో ప్రభుత్వవిప్ కొరముట్ల ప్రత్యేక పూజలు


రైల్వేకోడూరు అర్బన్: వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రభుత్వవిప్ కొరముట్ల


సిద్దవటం: భాకరాపేటలో హోమం పూజలు చేస్తున్న వేద పండితులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని పలు ఆలయాలలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి రాయచోటి కౌంటింగ్ సెంటర్‌కు బయలుదేరారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం, భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయం, భుజంగేశ్వర ఆలయాలతోపాటు పలు దేవస్థానాలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తనతోపాటు ఎంపీ మిథున్ రెడ్డి విజయం సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, అభివృద్ధి చేయడానికి ఆ దేవుడు, ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇవ్వనున్నారన్నారు. తమ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న ప్రభుత్వవిప్

పుల్లంపేట : సోమవారం సాయంత్రం, ఎస్‌ఆర్ పాలెంలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామిని ప్రభుత్వవిప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని హోమం పూజలు

సిద్దవటం : జగనన్నకు మహిళాల లోకం అండగా ఉందని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం భాకరాపేటలో సోమవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. అందుకోసం సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు ఎక్కువ శాతం వైఎస్‌ఆర్‌సీపీకి ఓట్లు వేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, రాజంపేట నియోజకవర్గంలో వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిల గెలవాలని ఎన్నికల ముందు నుంచి ఇప్పటి వరకు రాజ్యశ్యామల హోమం, చండీ హోమం, సుదర్శన హోమం, పారదర్శక హోమం వంటి పూజలు నిర్వహించామన్నారు. అంతే గాకుండా కడప బిల్టప్ వద్ద నున్న విజయ దుర్గా దేవికి పట్టువస్త్రాలు, వెండి గంట బహుకరించడం జరిగిందన్నారు. కల్పాడు చెర్చి అభివృద్ధి కోసం రూ.10వేలు అందజేసి ప్రార్థనలు చేశామన్నారు. అలాగే చాముండేశ్వరిపేట చర్చి వద్ద ఉన్న మేరీమాత విగ్రహం రూ. 35వేలతో నిర్మించి తాపల తయారీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు.


పుల్లంపేట: ప్రత్యేక పూజలు చేయిస్తున్న కొరముట్ల

ప్రాథమిక చికిత్స కేంద్రాల తనిఖీ


ప్రాథమిక చికిత్స కేంద్రంలో అనుమతి లేకుండా వాడుతున్న మందులు

సుండుపల్లె : మండలంలోని పలు ప్రైవేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యశాఖ డెమో అధికారి దేవ శిరోమణి సోమవారం సుండుపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డా. హసన్ వలీ, సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజక్షన్లు వేయడం, ఫ్లూయిడ్స్ పెట్టడం, ఆక్సిజన్ నెబలైజర్లు వాడడం, ఈసీజీలు తీయడానికి ఆర్‌ఎంపీ డాక్టర్లకు అర్హత లేదన్నారు. అయినా ఈ ప్రైవేటు ప్రాథమిక చికిత్సా కేంద్రాలలో అర్హతలు మించి అన్ని వైద్యాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. కొన్ని చికిత్సా కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టి ఫికెట్ కూడా లేకుండా, కొందరి ఆర్‌ఎంపీ వైద్యులకు వారి విద్యా అర్హత సర్టిఫికెట్లు లేకుండా చికిత్సలు చేస్తున్నారన్నారు. ప్రజలకు వీరు చేసే వైద్యంలో మందులను పరిమితికి మించి అధిక డోస్‌లను ఇచ్చి ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ప్రతిరోజూ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ వైద్యాన్ని అందిస్తారని, కావున ప్రజలు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలన్నారు. తదనంతరం వారు రిజిస్ట్రేషన్ లేని చికిత్సా కేంద్రాలను, అర్హతలేని డాక్టర్ల వివరాలను డీఎంహెచ్‌ఓకి తెలియపరిచి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జాతీయస్థాయి క్విజ్‌పోటీలకు ఎంపిక

మదనపల్లె : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ పోటీలకు పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ లో భాగంగా ఆన్‌లైన్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కే.రిషిత, టి.సుజితలు ముంబైలో జరిగే ఫైనాల్ క్విజ్ పోటీలకు ఎంపికయ్యారు. వీరికి క్విజ్ నిర్వాహకులు ఈనెల 30వ తేదీన 25 వేల రూపాయలు నగదు బహుమతి అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర తెలిపారు.

పింఛన్ల కోసం క్యూ


మినీ ఎస్‌బీఐ వద్ద క్యూ కట్టిన పింఛన్‌దారులు

పెద్దతిప్పసముద్రం: ప్రతి నెలా సూర్యోదయానికి ముందే వలంటీర్లు తమ గడప వద్దకే వచ్చి మాకు నిద్ర లేపి పింఛన్ డబ్బులు అందజేసేవారు.. చంద్రబాబు కారణంగా మాకు ఈ కష్టాలు వచ్చాయని పండుటాకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలో పలువురు పింఛన్ దారులు బ్యాంకుల వద్ద ఉదయం నుంచి క్యూ కట్టారు. గత రెండు నెలల నుంచి సుదూర ప్రాంతాల నుంచి అష్ట కష్టాలు పడి, మరి కొందరు ఆటోలు బాడుగకు మాట్లాడుకుని మండల కేంద్రానికి వచ్చి మండుటెండలో బ్యాంకుల వద్ద నిలబడి పింఛన్ సొమ్ము తీసుకోవాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొందని వారు వాపోయారు.

8వ తేదీ నుంచి బస్సుపాసులు

పీలేరు రూరల్ : ఈ విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 8వ తేదీ నుంచి విద్యార్థులకు బస్సు పాసులు పంపిణీ చేస్తున్న డీఎం కుమార్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బస్సు పాసులు మాడ్యూల్ సర్వర్ అప్‌డేట్ చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 8 నుంచి వికలాంగులతోపాటు అన్ని రకాల రాయితీ పాసులు ఇవ్వనున్నట్లు చెప్పారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ

కడప స్పోర్ట్స్: గుంటూరులో ఈనెల 2వ తేదీ నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన క్రీడాకారిణి అమీనా అండర్-9 విభాగంలో మూడోస్థానంలో నిలిచింది. ఏడు రౌండ్లలో 3 పాయింట్లు సాధించింది. ఈమెతో పాటు కడపకు చెందిన అనీస్‌దర్బారీ 5 పాయింట్లు, ప్రణవి 4 పాయింట్లు, లాస్యప్రియ 3 పాయింట్లు, హరీష్ 3 పాయింట్లు, నీలేష్ 2 పాయింట్లు, నందన 2 పాయింట్లు చొప్పున సాధించారు. వీరికి నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

కౌంటింగ్ దృష్ట్యా ఆంక్షలు కఠినం

గాలివీడు : సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఓట్లు లెక్కింపును దృష్టిలో పెట్టుకొని మంగళవారం మండలంలో 144 సెక్షన్‌ను పక్కాగా అమలు చేయడం జరుగుతుందని మండల ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని, నలుగురు కంటే ఎక్కువ మంది ఒకే చోటు గుమికూడవద్దని, బాణా సంచా పేలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రాయచోటిలో ఎన్నికల లెక్కింపు కేంద్రం వద్ద కేవలం అనుమతి(పాసులు) కలిగిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని, ఇతరులెవరూ వెళ్లరాదని తెలిపారు. సీసీ కెమెరాలతో మండలమంతా నిఘా ఉంచామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాన్ని హెచ్చరించారు.

ప్రజలు సహకరించాలి..

చిన్నమండెం : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని ప్రజలు సహకరించాలని చిన్నమండెం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలన్నారు. అలాగే ఎమర్జెన్సీ సర్వీసెస్ మాత్రమే మినహాయింపు ఉంటుందన్నారు. రోడ్డుపైన ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా జనాలు ఉన్నట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు పూర్తి స్థాయిలో తమకు సహకరించాలని ఆయన విన్నవించారు.

శతాబ్దాల నాటి నిలువురాయి తొలగింపు


జేసీబీతో తొలగించిన ఏళ్లనాటి నిలువురాయి

కురబలకోట: అంగళ్లు సమీపంలో ఉన్న కనసాని వారిపల్లె వద్ద పొలాల్లో శతాబ్దాలుగా ఉన్న పురాతన నిలువు రాయిని తొలగించారు. పొలాల్లో నిలువుగా ఈ రాయి ఉండడంతో నిలువురాయిగా పిలిచేవారు. ఇది ఉన్న పొలాల మీదుగా కొత్తగా బైపాస్ రోడ్డు వేస్తున్నారు. అగ్రామ యువ రైతు సుదీర్ రెడ్డి ఆధీనంలో ఈ రాయి ఉన్న పొలం ఉంది. ములకలచెరువు నుంచి మదనపల్లె (ఎన్‌హెచ్ 42) వరకు రూ.480 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా దొమ్మన్నబావి నుంచి వస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో ఈ పురాతన రాయి ఉంది. అధికారులు సూచనలతో గ్రామస్థుల సహకారంతో కాంట్రాక్టర్లు దీనిని తొలగించక తప్పలేదు. తరాలుగా ఉన్న రాయిని జేసీబీతో తొలగించినట్లు ఆ గ్రామ సర్పంచ్ కనసాని కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు వన్ను కొండారెడ్డి, యువ నాయకులు సుధీర్ రెడ్డి సోమవారం వెల్లడించారు. ఎలాంటి చిహ్నాలు, లిపి కూడా లేని అరుదైన ఈ పురాతన నిలువురాయి ఎప్పటి నుంచి ఉందో ఏ చరిత్రకు ఇది ఆనవాలో పెద్ద తరం వారు కూడా చెప్పలేకపోయారు. నాలుగైదు తరాలకు ముందు నుంచి ఉన్నట్లు పరంపరగా వస్తున్న పెద్ద తరం వారు చెప్పేవారు. పండగలు, పర్వదినాల సందర్భాల్లో ఇక్కడ గ్రామస్థులు పూజలు చేసేవారు. ఇది భూమిపై 12 అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పుతో అడుగుకు పైగా మందంతో ఉండేది. భూ మట్టం నుంచి కింద నాల్గు అడుగుల లోతున ఈ రాయి ఉన్నట్లు దీన్ని తొలగించినప్పుడు చూసిన గ్రామస్థులు వెల్లడించారు. తరాల నాటి ఈ పురాతన నిలువు రాయి గురించి స్థానికులు ఆసక్తికర ఆపై ఆశ్చర్యకర సంగతులు విన్పించేవి. దీనిని ఎవరు ఎందుకు నాటారో.. దీని మిస్టరీ ఏమిటన్నది సమాధానం దొరకని ప్రశ్నగానే మిగిలిపోయింది. బైపాస్‌కు అడ్డుగా ఉన్న కారణంగా దీనిని ఇప్పుడు పూర్తిగా తొలగించడంతో తీపి గురుతుగా ఉన్న దీని ఆనవాళ్లు కూడా కనమరుగయ్యాయి. రచయిత, పలమనేరు బత్తనపల్లె మునిరత్నం రెడ్డి మాట్లాడుతూ వెయ్యేళ్లకు ముందు నుంచి ఈ నిలువురాయి ఉండవచ్చని తెలిపారు. పూర్వీకులు కొందరు సమాధికి చిహ్నంగా ఇలాంటి నిలువురాళ్లు నాటేవారన్నారు. ఇలాంటివి తెలంగాణా, ఉత్తరాంధ్ర, నెల్లూరు ప్రాంతాల్లో ఇప్పటికీ కన్పిస్తాయన్నారు. రాయలసీమలో అరుదన్నారు. అలాంటి వాటిలో ఇది కూడా ఒకటై ఉండి ఉండవచ్చని వ్యక్తం చేశారు.

రౌద్రముఖి స్ఫూర్తితో లఘుచిత్రాలు

పీలేరు : రెండు రోజుల క్రితం విడుదలైన రౌద్రముఖి లఘుచిత్రం స్ఫూర్తితో ఇక ముందు కూడా మంచి మంచి లఘుచిత్రాలు నిర్మిస్తామని ఆ చిత్ర నిర్మాత సురేష్, దర్శకుడు సుహేల్ అన్నారు. సోమవారం స్థానిక ఎంఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్ లో రౌద్రముఖి చిత్రం సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూఢ నమ్మకాలు, దైవభక్తి, గూడెం ప్రజల జీవనశైలి నేపథ్యంలో రూపొందించి యూ ట్యూబ్‌లో విడుదలైన రౌద్రముఖి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నటీనటులు ఆల్ ది బెస్ట్ ఖాదర్‌బాషా, బాబ్జాన్, రాధాకృష్ణ, విజయ్, కృష్ణ, మల్లికార్జున, రాజు, మహేష్, గోపి, మధు, ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని ప్రార్థనలు

కురబలకోట: వైఎస్సార్ సీపీ విజయదంఖా మోగించి మరోసారి వైఎస్ జగన్ సీఎం కావాలని కోరుతూ తంబళ్లపల్లె నియోజక వర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు అజారుద్దీన్ నివాసంలో సోమవారం మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బడుగు బలహీన వర్గాల వారికి జగన్ సీఎం కావడం చాలా అవసరమని వారు తెలిపారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాజంపేట : కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. సోమవారం ఆకేపాటి ఎస్టేట్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలలో అనుసరించాల్సిన అంశాలు గురించి తెలియజేశారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు చివరి వరకు పూర్తిగా ఉండాలన్నారు. అభ్యర్థులకు డిక్లరేషన్ ఫారమ్ ప్రకటించేంత వరకు కౌంటింగ్ కేంద్రాన్ని విడిచి బయటకు రాకూడదన్నారు. ఏజెంట్లు కౌంటింగ్ నిబంధనలను పాటించాలన్నారు. ఎన్నికల సంఘం విధించిన నియమ నిబంధనలను ఏజెంట్లు కచ్చితంగా పాటించాలన్నారు. మంగళవారం తెల్లవారుజామునే కౌంటింగ్ కేంద్రానికి చేరాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు ఆకేపాటి అనిల్ రెడ్డి, రాజంపేట మున్సిపాల్టీ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలి


144 సెక్షన్ నిబంధనలను ప్రజలకు వివరిస్తున్న సీఐ పురుషోత్తంరాజు

సిద్దవటం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా దుకాణాల యజమానులు మంగళవారం స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేయాలని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన బస్టాప్ వద్ద సోమవారం ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండకూడదన్నారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడవద్దన్నారు. అలాగే టపాసులు పేల్చడంగాని, ర్యాలీలు గాని, ఊరేగింపులు గాని చేయవద్దని ప్రజలకు ఆయన హెచ్చరించారు. అనంతరం సిద్దవటంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా సోమవారం ప్రధాన కూడలి వద్ద సిద్దవటం పోలీసులతో ఎస్ఐ పెద్ద ఓబన్న బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ సన్నిధిలో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్


ఆలయంలో డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రంలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మను సోమవారం దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్‌లు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు. ఈఓ కొండారెడ్డి ఆధ్వర్యంలో వారిచేత ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. ఆలయం దినదినాభివృద్ధి చెందుతుండటంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

9న వన మహోత్సవంను జయప్రదం చేద్దాం

ఈనెల 9వ తేదీన నిర్వహించే వన మహోత్సవాన్ని పండుగలా నిర్వహించాలని, ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున మొక్కలు నాటాలని దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్‌లు పేర్కొన్నారు. దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో పెద్దఎత్తున చెట్లు నాటాలని వారు కోరారు. ఆలయ పెద్దలు వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ రామచంద్రలు దేవాదాయశాఖ అధికారులతో చర్చించారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో ఐసీఐసీఐ ఫౌండేషన్, దాతల సహకారంతో మొక్కలు నాటి సంరక్షిస్తుండడం అభినందనీయం, ఆదర్శనీయమంటూ అధికారులు కొనియాడారు.

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయిస్వామి

ఓబులవారిపల్లె : మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఇందుకు పంచాయతీలోని పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. అనంతరం ఎంపీపీ చీర్ల నాగమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-1 గూడూరు గౌరీశంకర్ రాజు, వైస్ ఎంపీపీ-2 కొమ్మూరు సుమిత్ర, ఎంపీటీసీ పైడి గిరినాయుడు, వత్తలూరు రోహిణీకుమార్‌రెడ్డి, రమేష్ రాజు, దుర్గా ప్రసాద్, కాగితపు సుజాత, కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగావశాలపై అవగాహన


మాట్లాడుతున్న నార్త్ స్టార్ అకాడమీ డైరెక్టర్ ఇర్ఫాత్

పీలేరు : డిగ్రీ చదువుతో మంచి ఉద్యోగాలు సాధించవచ్చునని నార్త్ స్టార్ అకాడమీ డైరెక్టర్ ఇర్ఫాత్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సీఎస్‌ఆర్ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్ తరువాత విద్య, ఉద్యోగావశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన సాంకేతిక ఆర్థిక జీవనోపాదుల నేపథ్యంలో డిగ్రీతో ఉద్యోగవకాశాలు ఉన్నాయన్నారు. డిగ్రీలో తమ తృతీయ ఏడాదిఓ టెస్టింగ్ టూల్స్, డాట్ నెట్, ఎస్‌ఏపీఐసీడబ్ల్యూ, ఏసీఎం ఏఅబాబ్‌ల్యాబ్, సైన్స్ వెబ్ టెక్నాలజీస్ వంటి సాంకేతిక కోర్సులు నేర్చుకుంటే ఉద్యోగం పొందవచ్చునని తెలిపారు. బీటెక్, ఎంబీఏ చదివిన వారు కూడా పై సాంకేతిక పోస్టులు నేర్చుకున్న అనంతరం సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పొందుతున్నాని తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు ప్రతిమ, శ్రీనివాస్, హరిచందన్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ, స్వాతి, వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జున, మోహన్‌బాబు, కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనకాయల పంపిణీ


విత్తన కాయల నాణ్యతపై రైతులను అడిగి తెలుసుకొంటున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

గుర్రంకొండ: రైతులకు నాణ్యమైన విత్తనకాయలను మాత్రమే పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లుట్ల ఆర్బీకేలో వేరుశనగ విత్తన కాయల పంపిణీని ప్రారంభించారు. ఈసందర్భంగా విత్తనకాయల నాణ్యతపై రైతులను అడిగి తెలుసుకొన్నారు. ఆర్బీకేలో విత్తనకాయలు వచ్చిన స్టాకు పంపిణీ చేసి స్టాకు వివరాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనకాయలు నాణ్యతలేవని ఫిర్యాదు చేస్తే ఆర్బీకే సిబ్బంది వెనక్కు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది ముందుగా ఆర్బీకేల్లోనే విత్తనాల నాణ్యత పరిశీలించాలన్నారు. ఎవరైనా సిబ్బంది ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా విత్తనాధికారి రమేష్‌రాజు, ఇన్‌చార్జ్ ఏఓ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీఈఓ రిజ్వానా, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట సాగు చేయకుంటే పథకాలు కట్

బి.కొత్తకోట: వేరుశనగ రాయితీ విత్తనకాయలు తీసుకున్న ప్రతి రైతూ పంటను సాగు చేయాలని లేనిపక్షంలో ప్రభుత్వ పథకాలు అందవని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె ఆర్‌బీకేలో విత్తనకాయల పంపిణీ కార్యక్రమం పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంపిణీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీ విత్తన కాయలు తీసుకున్న రైతులు పంటలు సాగు చేయాలని, ఆ పంటను ఈ క్రాప్ ద్వారా నమోదు చేయడం ఖచ్చింతంగా జరుగుతుందని చెప్పారు. జిల్లాలో రైతులకు పంపిణీ చేసేందుకు 55,300 క్వింటాళ్ల విత్తనకాయలను ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో ఇప్పటికే 37వేల క్వింటాళ్లను పంపిణీ చేసామన్నారు.